క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని ఎమ్మెల్సీ నివాసంలో శనివారం ఉరవకొండ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అందించారు. బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామానికి చెందిన గుడిపూటి రమాదేవికి రూ.90 వేలు, విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి చెందిన రాజమ్మకు రూ.65 వేలు, గుంతకల్లు పట్టణం పాత గుంతకల్లుకు చెందిన తుంగా భాగ్యలక్ష్మికి రూ.2లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, రమణయాదవ్, సూరి, తిరుపాల్‌యాదవ్, తిప్పారెడ్డి, కాకర్ల నాగేశ్వరావు, సోమర జయచంద్ర నాయుడు, రామచంద్ర పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న వైద్య సిబ్బంది

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వాచ్‌మెన్ నరసింహులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం మండల వైద్యాధికారి రాజేష్, సిబ్బంది ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరసింహులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహులు కుటుంబ సభ్యులకు రూ.38 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం రేపు

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా భవనాలు, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఉంటుందని ఎంపీపీ నారాయణ రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ , ఎంపీ రంగయ్యల, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



ఉమ్రా యాత్రికులను సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లే వారిని పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పట్టణానికి చెందిన శర్మాస్‌వలి, మతీనా, జెంషీరాలతో పాటు మరో 10 మంది శనివారం ఉమ్రా యాత్రకు బయలు దేరారు. వారిని మత పెద్దలు ఘనంగా సన్మానించి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలం మురడి గ్రామ పంచాయతీ పరిధిలోని తమ్మేపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 7 గంటలకు విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి శనివారం తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘం నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: ఎయిడ్స్ నిర్మూలన వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఐవీ ఎన్ని రకాలుగా సోకుతుంది?, హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలే, సోకిన తరువాత వాడాల్సిన మందులపై ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రమౌళి, రైడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వైకేపీలో అక్రమాల పుట్ట

- రూ.లక్షల్లో పొదుపు రుణాలు స్వాహా
- గుమ్మఘట్ట మండలంలో తరచూ వెలుగుచూస్తున్న వైనం
- ఇప్పటికే ఓ సీసీ సస్పెన్షన్.. తాజాగా బయటపడ్డ యానిమేటర్ బాగోతం



సమావేశమైన డ్వాక్రా సభ్యులు (ఫైల్)

రాయదుర్గం: పొదుపు సంఘాల్లోని మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వైకేపీ సిబ్బంది రూ.లక్షల్లో సొమ్ము కాజేస్తున్నారు. ప్రతి నెల బాకీ కంతులు చెల్లిస్తున్నా, మొండి బకాయికింద బ్యాంకర్లు నోటీసులు జారీ చేయడంపై సంఘ సభ్యులు కలవరపాటుకు లోనవుతున్నారు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలంలో తరచూ 'వెలుగు' చూస్తుండడం ఆందోళన కలిగించే అంశం. పూలకుంట క్లస్టర్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ సీసీ ఏడాదిన్నర క్రితం సుమారు రూ.30 లక్షల వరకూ స్త్రీనిధి, ఉన్నతి ఇతర రుణాల్లో చేపట్టిన రికవరీ సొమ్ము మొత్తం స్వాహా చేశాడు. ఈ కారణంగా ఉన్నతాధికారులు అతడ్ని సస్పెండ్ చేశారు. తాజాగా గొల్లపల్లిలో ఓ 'యానిమేటర్' చేతివాటం ప్రదర్శించాడు. గ్రామంలో 60 డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారు. అందులో 18 సంఘాల్లో అక్రమాలకు తెరలేపాడు. నెలవారీ కంతులతో పాటు ఇతర రుణాల్లోనూ భారీ మోసానికి యత్నించాడు. యానిమేటర్ భాగోతంపై ఆలస్యంగా తెలుసుకున్న డ్వాక్రా సభ్యులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం ఉన్నతాధికారులు గ్రామంలో విచారణ చేపట్టగా సుమారు రూ.12 నుంచి రూ.15 లక్షల వరకూ గోల్‌మాల్ చేసినట్టు నిర్ధారించారు. అప్పటి నుంచి యానిమేటర్ పరారీలో ఉన్నట్టు అధికారులు వివరించారు. దుర్వినియోగమైన సొమ్ము రికవరీ చేపట్టేలా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. వెలుగులోకి ఈ రెండు ఘటనలు మాత్రమే వచ్చాయి. ఇలా అనేక చోట్ల స్త్రీనిధి, ఉన్నతి రుణాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, సమగ్రంగా విచారణ జరిపిస్తే మరింత మంది బాగోతం తప్పక భయటపడుతుందని సొంత శాఖలోనే ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి.

రుణాల మంజూరులోనూ చేతివాటం

రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్ తో పాటు ఐదు మండలాల్లో 7,224 సంఘాలు ఏర్పాడ్డాయి. సుమారు 62 వేల మంది సభ్యులున్నారు. ఒక్కో సంఘానికి కనిష్టంగా రూ. లక్ష నుంచి రూ.20 లక్షల దాకా బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తున్నారు. గత ఏడాది 2022 ఏప్రిల్ నుంచి ప్రస్తుతం 2023 అక్టోబర్ నెల వరకూ ఐదు మండలాల్లో 3819 సంఘాలు, అర్బన్‌లో ఈ ఏడాది 306 సంఘాలు రుణ అర్హత సాధించాయి. మండలాల్లో రూ.28.31 కోట్లు, అర్బన్ లో రూ.39.41 కోట్లు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందించారు. రుణ మొత్తాన్ని బట్టి వెలుగు సిబ్బంది రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ అనధికారికంగా ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నారు. అర్బన్‌తో పాటు ఆయా మండలాల్లో డ్వాక్రా సభ్యులు నేరుగా ఆరోపణలు సంధిస్తున్నారు. ఇటీవల పట్టణ మెప్మా పరిధిలోని ఓ ఉద్యోగి రూ.20 వేలు డిమాండ్ చేయడంతో సభ్యులు కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళన చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చివరగా వసూలు చేసిన మొత్తాన్ని డ్వాక్రా సభ్యులకు తిరిగి చెల్లించారు. ఇలా చాలా చోట్ల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎక్కువయ్యాయి. కళ్యాణదుర్గం మండలం ఇట్లంపల్లి గ్రామంలోనూ 3.35 లక్షల సొమ్మును వైకేపీ సిబ్బంది, బ్యాంకు అధికారులు కాజేశారు. తెలియకుండానే డబ్బులు డ్రాకావడం పట్ల డ్వాక్రా మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇలాంటి వ్యవహారాలపై కఠిన చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

సొమ్ము రికవరీ చేయిస్తాం



గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో యానిమేటర్ స్వాహాకు పాల్పడ్డ ప్రతి పైసా రికవరీ చేయిస్తాం. దారికి రాకపోతే పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేయిస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం. పొదుపు సంఘ సభ్యుల నుంచి రుణాల మంజూరు సమయాన వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. విచారణలో తేలితే విధుల నుంచి తప్పిస్తాం. డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. దానికి విరుద్ధంగా ఎవరూ పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– గంగాధర, ఏరియా కో–ఆర్డినేటర్, రాయదుర్గం

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధ్యమే..



శౌచాలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్: ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించవచ్చని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం తన సొంతనిధులు రూ.3.50 లక్షలతో నిర్మించిన శౌచాలయాలు, శిలాఫలకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రమ, పట్టుదల, ఆత్మస్థైర్యం ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. జేకేసీ బ్యాచ్ ముగింపు సమావేశంలో విద్యార్థులకు నైపుణ్యాన్ని అందుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, కళాశాల డెవలప్‌మెంట్ సెక్రటరీ బసవరాజు, ఉడేగోళం ఉలుగప్ప, రాయంపల్లి రామాంజనేయులు, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం



కుందుర్పి మండలం అపిలేపల్లిలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లిలో శనివారం వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై అలంకరించి మహిళలు, పురుషులు బోనాలతో ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వాల్మీకి పెద్దలు వాల్మీకుల హక్కుల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో అప్పిలేపల్లి, మందలపల్లి, జానంపల్లి గ్రామాలకు చెందిన వాల్మీకులు పాల్గొన్నారు.

శెట్టూరు: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శమని మార్కెట్ యార్డ్ మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అడవిగొల్లపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో నాయకులు బిక్కి హరి, రాజశేఖర్, ఎంపీటీసీ నరసింహులు, మల్లికార్జునప్ప, ఓబులేసు, బసవరాజు, ముత్యాలు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గజగౌరీ ఉత్సవాలు



అలంకరణలో కడ్లే గౌరమ్మ దేవి

బొమ్మనహాళ్: భక్తుల పాలిట కొంగు బంగారం.. గజగౌరీ దేవి ఉత్సవాలను ఏటా కార్తీక మాసంలో పౌర్ణమి రోజు నుంచి మూడు రోజులపాటు మహిళలు వైభవంగా నిర్వహిస్తారు. కర్ణాటక సరిహద్దు మండలాలైన బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా అమ్మవారిని గజగౌరీదేవి అని, కడ్లే గౌరమ్మ అనే పేర్లతో పిలుస్తారు. తెలంగాణలో బతుకమ్మ ,సమ్మక్క సారక్క జాతరలను తలపించేలా ఇక్కడ 27వ తేదీ నుంచి ఉత్సవాలను నిర్వహించనున్న నేపథ్యలో మండంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, లింగదహాళ్, గోవిందవాడ, శ్రీధరఘట్ట, బొల్లనగుడ్డం, బొమ్మనహాళ్, గోనేహాళ్, దర్గాహొన్నూరు, సింగనహళ్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చక్కెర హరతులు, రథోత్సవం, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

గౌరీదేవి ఉత్సవాలు ఇలా..

ఈ నెల 27వ తేదీ నుంచి మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, కృష్ణాపురం, సింగేపల్లి, బొల్లనగుడ్డం, గోనేహాళ్, తదితర గ్రామాల్లో గజగౌరీదేవి విగ్రహ ప్రతిష్ట, రాత్రి నోములు, 28న సాయంత్రం 5 గంటలకు నుంచి గజగౌరీదేవికి ప్రత్యేక చక్కెర హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 29న తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రథోత్సవం, అనంతరం నిమజ్జనోత్సవం జరుగుతుంది. అలాగే మండలంలోని గోవిందవాడ, కల్‌హోళ గ్రామాల్లో 28వ తేదీ కడ్లే గౌరీ విగ్రహ ప్రతిష్ట, 29న తేదీన కడ్లే గౌరీదేవికి ప్రత్యేక చక్కర హారతులు, 30న కడ్లేగౌరీదేవి ఊరేగింపు, నిమజ్జనోత్సవం జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

29న రాష్ట్రస్థాయి రాతి దూలం లాడుగు పోటీలు

గజగౌరీ దేవి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న ఉదయం 8 గంటలకు ఉద్దేహాళ్ గ్రామంలో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు, నాల్గవ బహుమతి రూ. 8 వేలు, ఐదో బహుమతి 5 వేలు ప్రకారం అందజేస్తామన్నారని నిర్వాహకులు తెలిపారు. అలాగే హరేసముద్రం గ్రామంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు.

మార్పులు, చేర్పులపై నిర్లక్ష్యం వీడండి



మాట్లాడుతున్న ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం/శెట్టూరు: ఓట్ల తొలగింపు, చేర్పుల విషయంలో బీఎల్వోలు నిర్లక్ష్యం వీడాలని ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత ఆదేశించారు. కళ్యాణదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్వోలు ఫారం-6,7,8 క్లెయిమ్‌లపై ప్రత్యేకశ్రద్ధ కనబరచాలన్నారు. కొత్త ఓటర్లను చేర్పేందుకు యువతకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు ఉదయం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా బూత్‌ల బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, డీటీలు వెంకటేశులు, నాగరాజు, ఎన్నికల సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే శెట్టూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరెడ్డి, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఓటరు జాబితాపై పలు సూచనలిచ్చారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం

రాయదుర్గం రూరల్: యువతలో క్రీడాప్రతిభను వెలికి తీయడం కోసం డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఈఓపీఆర్డీ రంగనాయకులు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్పోర్ట్స్ వలంటీర్లకు డీఆర్పీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో క్రికెట్, బ్యాట్మింటన్ , వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. 15 సంవత్సరాలు నిండి , ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ నెల 27 నుంచి మీ పరిధిలోని సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబబర్ 15 నుంచి జనవరి 26 వరకు గ్రామస్థాయి, మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో విజేతలైన జట్లకు రాష్ట్ర స్థాయిలో క్రీడలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ చిక్కణ్ణ, మండల విద్యాధికారులు నాగమణి, వెంకటరమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ సిబ్బంది, మండలంలోని వలంటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ వెంకటేశులు, మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాల్మన్, ఎంఈఓ బాబు, నియోజకవర్గ కోఆర్డినేటర్ చల్లా కిరణ్, మండల కోఆర్డినేటర్ రమేష్, ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ శ్రీరామ్, మున్సిపాలిటీ మేనేజర్ అశ్వర్థ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గజగౌరి వేడుకలు కలసికట్టుగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ సుస్మిత

కణేకల్లు: గజగౌరీదేవి ఉత్సవాలు కలసికట్టుగా నిర్వహించాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ సుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని బెణికల్లులో గజగౌరి వేడుకల విషయంలో ఎస్సీ, నాన్ ఎస్సీల మధ్య రెండ్రోజుల నుంచి వివాదం నెలకొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ, డీఎస్పీ, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ శనివారం గ్రామ పెద్దలను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి శాంతి సమావేశం నిర్వహించారు. దళితులపై చిన్నచూపు చూడటం తగదన్నారు. గ్రామస్తులంతా కలసికట్టుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ రజాక్‌వలీ,ఎస్ఐ దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బొమ్మనహాళ్/కణేకల్లు/కుందుర్పి/బ్రహ్మసముద్రం: ఆర్డీటీ ఆధ్వర్యంలో బొమ్మనహాళ్, కణేకల్లు, కుందుర్పి, బ్రహ్మసముద్రం తదితర మండలాల్లో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. అనంతరం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీటీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్లు మల్లికార్జున, ప్రమీళ, ఎకాలజీ డైరెక్టర్ హనుమంతరాయుడు, సీఓ రామకృష్ణ ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ రామాంజనమ్మ, ఏటీఎల్‌లు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణస్వామి, మహిళా సంఘ సభ్యులు, ఆర్‌డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు



లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న చిన్నారులు

ఉరవకొండ: హిందూ ధర్మాన్ని పరిరక్షించడం, ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు, నైతిక విలువలు పెంపొందించడం కోసం రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 19న ప్రారంభమైన ధర్మప్రచార వారోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు అనంతపురం ఇస్కాన్ మందిరం చైర్మన్ దామోదర గౌరాంగదాస్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, దివ్యభవాని ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనృసింహ స్వామి పల్లకి సేవ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు బీటీపీలో చేప పిల్లల విడుదల

రాయదుర్గం: బీటీపీ రిజర్వాయర్‌లో ఆదివారం 6.44 లక్షల చేప పిల్లలు విడుదల చేస్తామని ఎఫ్‌డీఓ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై రిజర్వాయర్‌లోకి చేప పిల్లలను విడుదల చేస్తారన్నారు. గతంలో విడుదల చేసిన చేపలు నాణ్యతగా వృద్ధి చెంది మత్స్యకారులకు లాభాలు తెచ్చిపెట్టాయన్నా. జాలర్లు, మత్స్య సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. మత్స్యకారులకు వలలు, బోట్లు, వాహనాలు, రాయితీతో అందించారన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని గవిమఠంలో ఆదివారం కార్తీక పౌర్ణమి, కార్తీక దీపోత్సవ కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టనున్నట్లు ఆ మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ శనివారం తెలిపారు. ఉదయం చంద్రమౌళీశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాల అనంతరం గవిసిద్ధేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అనంతరం గవిమఠం మొదటి పీఠాధిపతి కరిబసవ రాజేంద్రస్వామి జీవసమాధి వద్ద రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర స్వామి ఆధ్వర్యంలో సాయంత్రం లక్ష దీపోత్సం ఉంటుందన్నారు.

నేడు జ్వాలాతోరణ దర్శన పూజలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవ పూజలను నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు జ్వాలా తోరణం ఏర్పాటు చేసి గౌరీ దేవి పూజలు నిర్వహిస్తామన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం



బ్రోచర్ అందజేస్తున్న మండల కన్వీనర్, నాయకులు

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి సూచించారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మండలంలోని కలుగోడు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. మంచి చేసే జగన్‌ను ఆదరించాలని , చెడు చేసే టీడీపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లికార్జున, వార్డు మెంబర్ శివ, కరిడిపల్లి లక్ష్మీకాంతారెడ్డి, పాలాక్షిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తిప్పేస్వామి, నాగేంద్రప్ప, వీరారెడ్డి, శీనప్ప, చిత్తయ్య, బొమ్మేశ్ తదితరులు పాల్గొన్నారు.'

నాటుసారా స్థావరాలపై దాడి

బెళుగుప్ప: మండలంలోని నాటుసారా స్థావరాలపై కళ్యాణదుర్గం సెబ్ ఎస్ఐ క్రిష్ణానాయక్ సిబ్బందితో కలసి శనివారం దాడులు నిర్వహించారు. స్థావరాల్లో నిల్వ ఉన్న950 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం నాటుసారా, కర్ణాటక మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన నిందితులు గంగవరం గ్రామానికి చెందిన అంకె నారాయణ, షేక్ దిల్షాద్‌పై బైండోవర్ కేసులు నమోదు చేసి డిప్యూటీ తహసీల్దార్ పీరా ఎదుట హాజరు పరిచారు.

సంక్షిప్త సమాచారం

సంక్షేమ పథకాలపై ప్రచారం

కుందుర్పి: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం మండలంలోని అప్పిలేపల్లి, కరిగానిపల్లి పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, వైద్యాధికారిణి అనూష, సర్పంచ్ అతావుల్లా, ఎంపీటీసీ కెంచమ్మ, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'వికసిత్ యాత్ర'

శెట్టూరు: కేంద్ర ప్రభుత్వం ప్రాతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం యాటకల్లు, మధ్యాహ్నం చిన్నంపల్లిలో కార్యక్రమం ఉంటుందన్నారు. 26న యాటకల్లు, చిన్నంపల్లి, 27న ఐదుకల్లు, శెట్టూరు, 28న చింతర్లపల్లి, మాకోడికి, 29న చెర్లోపల్లి, కై రేవు, 30న లక్ష్మంపల్లి, బచ్చేహళ్ళి, డిసెంబర్ 1న అయ్యగార్లపల్లి, కనుకూరు, 2న పెరుగుపాళ్యం, ములకలేడు, 3న తిప్పనపల్లి, అనుంపల్లి గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

గ్రామాలపై నిఘా ఉంచండి

వజ్రకరూరు: గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలపై నిరంతరం నిఘా ఉంచి.. అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

బాలిక అదృశ్యం



స్వాతి

కూడేరు: మండలంలోని పి.నారాయణపురానికి చెందిన స్వాతి(16) అనే బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. స్వాతి కూడేరులోని కేజీబీవీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. రెండు నెలలుగా ఇంటి వద్దనే ఉంటోంది. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ చూస్తుంటే తల్లి మందలించింది. దీంతో శనివారం శనిఉదయాన్నే చెప్పా పెట్టకుండా వెళ్లింది. తల్లి లక్ష్మీ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ విత్తనాల పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, బేలోడు,75 వీరాపురం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం కింద ఎస్సీ రైతులకు విత్తనాలను శనివారం పంపిణీ చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాల్మన్‌రాజు తెలిపారు. 43 మంది రైతులకు కంది, జొన్న, రాగి, సజ్జ, అనుములు, పెసలు, పెరటితోట విత్తనాలను ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు గీతమ్మ, అరుణకుమారి, సిబ్బంది సత్యనారాయణ, షాకీరాబేగం, రైతులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.52 వేల ఆదాయం

కంబదూరు: మద్యం అక్రమ రవాణ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు శనివారం స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సెబ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.52 వేల ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ మొహిద్దీన్ బాషా తెలిపారు.